
మూతపడిన బడి ప్రారంభం
● అలిరాజపేటలో తెరుచుకున్న ప్రాథమిక పాఠశాల 7లో

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



జాడలేని వాన



పోతారం(ఎస్)లో విత్తనాలు నాటేందుకు కాడెద్దులతో సాలు దున్నుతున్న రైతులు(ఫైల్)

- మొలకెత్తని పత్తి, మొక్కజొన్న విత్తనాలు
- ఆందోళనలో రైతాంగం
- ఇంకా నమోదు కాని సగటు వర్షపాతం

హుస్నాబాద్ రూరల్, జూన్ 14 : ఉంటే అతివృష్టి.. లేదంటే అనావృష్టి అన్నట్లుగా ఉంది జిల్లాలోని రైతుల పరిస్థితి. ముందుగా కురిసి మురిపించిన వర్షాలు చూసి కొందరు రైతులు విత్తనాలను సిద్ధం చేసుకున్నారు. సాగు పనులు ముమ్మరంగా చేపట్టారు. అంతా సవ్యంగా సాగుతుందనుకున్న సమయంలో వరుణుడు మొహం చాటేశాడు. వర్షాకాలం ప్రారంభమై 12 రోజులు గడుస్తున్నా చినుకుజాడ లేదు. ఇప్పటికే పనులు మొదలు పెట్టిన, సాగుకు సిద్ధమవుతున్న రైతులు వర్షాలు కురవకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. హుస్నాబాద్ డివిజన్‌లో సాగు చేసిన పంటలు ఇప్పుడు నీరు లేక వాడిపోతున్నాయి. డివిజన్‌లోని హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ, బెజ్జంకి, మండలాల్లోని కొన్ని మండలాల్లో నైరుతి రుతుపవనాల ప్రభావంతో మొదట ఓ మోస్తరు వర్షం కురిసినా.. జిల్లా వ్యాప్తంగా ఇంకా సగటు వర్షపాతం నమోదు కాలేదు. జూన్‌లో 104 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా ప్రస్తుతం 53.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సిద్దిపేట జిల్లాలోని కొన్ని మండలాల్లో సగటు వర్షపాతం కంటే తక్కువగా నమోదైంది. ఇక ఈ వానాకాలంలో 5.51లక్షల ఎకరాల్లో సాగు అంచనా వేయగా ప్రస్తుతం 21 వేల ఎకరాల్లో మాత్రమే సాగైంది. వర్షాలు లేక మొక్కజొన్న, పత్తి వాడిపోతుండగా, మరికొన్ని చోట్ల నగం విత్తనాలు భూమిలోనే ఉండి పోయాయి. వర్షాలు సకాలంలో కురవకపోతే పెట్టుబడి కూడా రాదని ఎకరాకు దాదాపు రూ.10వేల పైనే ఖర్చు చేశామని వాపోతున్నారు. ఇక కౌలు రైతుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. పంటలు సరిగా పండకపోయినా కౌలు డబ్బు, పెట్టుబడులతో అప్పుల పాలవుతామని ఆవేదన చెందుతున్నారు. వ్యవసాయ బావుల మీద ఆధారపడిన రైతులు స్పింక్లర్ల ద్వారా నీటిని అందిస్తూ పంటలను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు.



గోవర్ధనగిరిలో మొక్కజొన్న విత్తనాలు మొలకెత్తడం కోసం స్పింక్లర్ల ద్వారా నీటిని అందిస్తున్న దృశ్యం

ఖరీఫ్‌లో సాగు అంచనా

వరి	- 3 లక్షల ఎకరాలు
పత్తి	- 1.80 లక్షల ఎకరాలు
మొక్కజొన్న	- 60 వేల ఎకరాలు
కందులు	- 10 వేల ఎకరాలు
పెసర	- వేయి ఎకరాలు
పచ్చిరొట్ట	- 21 వేల ఎకరాలు

జూన్ 14 వరకు సాగు చేసిన పంటల వివరాలు

పత్తి	- 28 వేల ఎకరాలు
మొక్కజొన్న	- 1255 ఎకరాలు
వరి	- 110 ఎకరాలు నారుమళ్లు(వరినర్సరీ)
కూరగాయలు	- 200 ఎకరాలు

విత్తనాలు మొలకెత్తడం లేదు



- ఇప్ప సరోజన, కౌలు రైతు బంజేరుపల్లి

ముందుగా కురిసిన వర్షాలకు మూడెకరాల్లో పత్తి విత్తనాలను నాటాను. విత్తనాలు నాటిన నుంచి వర్షం లేదు. ఎకరాకు మూడు ప్యాకెట్ల పత్తి విత్తనాలను నాటాను. అందులో సగం కూడా మొలకెత్తలేదు. మళ్లీ పోగుంటలుగా ఎకరాకు మరో రెండు ప్యాకెట్ల విత్తనాలను నాటాను. వర్షాలు లేక రెండోసారి నాటిన విత్తనాలు కూడా భూమిలోనే వట్టిపోతాయని ఆందోళనగా ఉంది. కౌలుకు తీసుకుని పత్తి సాగుచేస్తే నష్టమే మిగిలేలా ఉంది. ప్రభుత్వం కౌలురైతులను ఆదుకోవాలి.

ఈ ఏడాది విస్తారంగా వర్షాలు



పి.మహేష్, జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి

ఈ ఏడాది వర్షాలు విస్తారంగా కురుస్తాయని వాతావరణశాఖ చెబుతుంది. జిల్లావ్యాప్తంగా జూన్‌లో 104 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాలి కానీ ఇప్పటి వరకు 53.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సాగుకు ఇంకా సమయం ఉన్నందున రైతులు అధైర్యపడాల్సిన అవసరం లేదు.



బంజేరుపల్లిలో మొలకెత్తని విత్తనాల స్థానంలో పోగుంటలుగా పత్తి విత్తనాలు నాటుతున్న కూలీలు

టీ తాగేందుకు వచ్చి హోటల్ యజమానికే టోపీ

- గూగుల్ పే ద్వారా రూ.96 వేలు చోరీ



అక్కన్నపేట, జూన్ 14: హోటల్‌లో టీ తాగేందుకు వచ్చిన ఓ వ్యక్తి.. ఏకంగా ఆ హోటల్ నిర్వాహకుడి ఫోన్ నుంచే గూగుల్ పే ద్వారా రూ.96వేలు చోరీ చేసిన సంఘటన శుక్రవారం అక్కన్నపేట మండల కేంద్రంలో చోటుచేసుకున్నది. ఎస్ఐ తాండ్ర వివేక్ తెలిపిన వివరాల ప్రకారం రాజస్థాన్‌కు చెందిన నారాయణ ఐదేళ్లుగా అక్కన్నపేట మండల కేంద్రంలో రాజస్థాన్ హోటల్ నిర్వహిస్తున్నాడు. శుక్రవారం హోటల్‌కు చత్తీస్‌ఘడ్‌కు చెందిన ఓ వ్యక్తి టీ తాగేందుకు వచ్చాడు. టీ తాగిన తర్వాత తన వద్ద డబ్బులు లేవని తన మిత్రుడు గూగుల్ పే ద్వారా డబ్బు పంపిస్తాడని ఫోన్ చేసి నంబర్ చెప్పాలని హోటల్ నిర్వాహకుడిని కోరాడు. దీంతో హోటల్ నిర్వాహకుడు నారాయణ ఆ వ్యక్తి చెప్పిన నంబర్‌కు ఫోన్ చేయడంతో రూ.500 అవతలి వ్యక్తి గూగుల్ పే చేశాడు. అనంతరం సదరు వ్యక్తి హోటల్ నిర్వాహకుడిని ఒకసారి ఫోన్ ఇవ్వాలని, తన స్నేహితుడికి ఫోన్ చేసి మాట్లాడుతానని తీసుకుని గూగుల్ పే ద్వారా రూ.96వేలు తన స్నేహితుడి ఫోన్ నంబర్‌కు పంపించాడు. పనిలో పడి సదరు హోటల్ నిర్వాహకుడు పట్టించుకోలేదు. ఆ తర్వాత చూసే సరికి తన అకౌంట్‌లో డబ్బులు లేవు. తాను మోసపోయినట్లు గుర్తించి వెంటనే అక్కన్నపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. హోటల్ నిర్వాహకుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తాండ్ర వివేక్ తెలిపారు.

ఒకే వ్యక్తిని మూడుసార్లు ప్రధానిని చేసిన ఘనత బీజేపీది

- గజ్వేల్ భూములపై విచారణ జరపాలి
- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు
- సిద్దిపేటలో విజయోత్సవ ర్యాలీ, సభ

సిద్దిపేట టౌన్, జూన్ 14: 1962 తర్వాత దేశచరిత్రలో ఒకే వ్యక్తిని మూడుసార్లు ప్రధానిని చేసిన ఘనత బీజేపీకే దక్కుతుందని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు వ్యాఖ్యానించారు. మెదక్ ఎంపీగా రఘునందన్‌రావు గెలిచినందుకు హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం సిద్దిపేటలో బీజేపీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు స్థానిక బీజేఆర్ చౌరస్తా నుంచి పురవీధుల గుండా విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ మేరకు పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. 25 ఏళ్ల నుంచి అధికారం అహంకారంగా మారిందని, అందుకే తనకు ప్రజలు గెలుపునందించారని తెలిపారు. బీఆర్‌ఎస్ అన్నివర్గాల ప్రజలను అణిచివేయాలని చూసిందని, బీజేపీ కార్యకర్తల కష్ట ఫలితమే తెలంగాణలో ఆ పార్టీ ఒక్క సీటు కూడా గెలవలేక పోయిందన్నారు. మల్లన్నసాగర్‌లో తన చితి తానే పేర్చుకుని మరణించిన రైతు మల్లారెడ్డికి తన గెలుపు అంకితమని చెప్పారు. దుబ్బాకలో రఘునందన్‌రావుకు ప్రొటోకాల్ లేకుండా చేద్దామనుకున్నారని, కానీ నేడు సిద్దిపేటలో కూడా ప్రొటోకాల్ వచ్చిందని తెలిపారు. తన గెలుపు కోసం బీఆర్‌ఎస్ నాయకులు పరోక్షంగా ప్రచారం చేశారని ఆయన పేర్కొన్నారు. లోకల్ బాడీ ఎన్నికలు నిర్వహించే దమ్ము ఈ ప్రభుత్వానికి లేదని, బీజేపీ కార్యకర్తలు పాత, కొత్త సీఎంలను బొందపెట్టారని ఎద్దేవా చేశారు. ఎన్ని కుతంత్రాలు, ఎన్ని డబ్బులు పంచినా కూడా దేశంలో బీజేపీ గెలిచిందన్నారు. పూర్వం నరకాసురుడు చనిపోతే దీపావళి జరుపుకున్నట్లు.. నేడు మెదక్‌లో బీజేపీ గెలిస్తే అంత సంబరాలు జరుపుకుంటున్నారని చెప్పారు. ఎమ్మెల్సీ వెంకట్రామారెడ్డి 30 రోజుల్లో గజ్వేల్ ప్రాంత క్షీరాసాగర్ రైతులకు వారి భూములను తిరిగి ఇవ్వకపోతే ఎక్కడి వరకైనా పోరాటం చేస్తానని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డికి, రెవెన్యూ మంత్రి శ్రీనివాస్‌రెడ్డికి చిత్తశుద్ధి నిజాయితీ ఉంటే వెంకట్రామారెడ్డి గుంజుకున్న గజ్వేల్ భూములపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై అవినీతి జరిగిందన్న రేవంత్‌రెడ్డి నేటికీ దానిపై చర్యలు తీసుకోవడం లేదని, ఫోన్ ట్యాపింగ్‌పై చర్యలు ఎందుకు చేపట్టడం లేదని ఎంపీ రఘునందన్‌రావు ప్రశ్నించారు. కార్యక్రమంలో మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సిద్దిపేట పట్టణంలో ఎంపీ రఘునందన్‌రావు భారీ గజమాలను వేస్తున్న నాయకులు, కార్యకర్తలు



నంగునూరు మండలం నర్మెట్ట గ్రామశివారులో నిర్మిస్తున్న ఆయిల్‌పాం ఫ్యాక్టరీ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ మను చౌదరి

మందకొడిగా ఆయిల్‌పాం ఫ్యాక్టరీ పనులు కలెక్టర్ అసహనం

నంగునూరు, జూన్ 14 : నంగునూరు మండలం నర్మెట్ట గ్రామశివారులో నిర్మిస్తున్న ఆయిల్‌పాం ఫ్యాక్టరీ నిర్మాణ పనులు మందకొడిగా జరుగుతున్నాయని కలెక్టర్ ఎం. మనుచౌదరి అసహనం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రూ.300 కోట్ల వ్యయంతో ఈ ఫ్యాక్టరీ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు టీజీ ఆయిల్ ఫెడ్ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అయితే పనులు నెమ్మదిగా సాగడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. నిర్దేశితకాల పరిమితి లోపు పనులు పూర్తిచేయాలని హెచ్చరించారు. ఇప్పటి వరకు వాటర్ ట్యాంకు, పాంపాండ్ నిర్మాణం, కార్యాలయ భవనం దాదాపు పూర్తికావొచ్చినట్లు ఆయిల్‌ఫెడ్ అధికారులు మ్యాప్ ద్వారా వివరించారు. స్థానికంగా ఇసుక కొరత మూలంగా కమిషనర్ స్థాయిలో మాట్లాడి భూపాలపల్లి నుంచి ఇసుక డంపు చేసుకునేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఫ్యాక్టరీ నిర్మాణం వేగంగా పూర్తిచేయాలని ఈ విషయాన్ని కాంట్రాక్టర్లకు తెలియజేయాలని ఇంజనీరింగ్ అధికారులకు కలెక్టర్ మనుచౌదరి సూచించారు. జిల్లాలో ఆయిల్‌పాం పంట దిగుబడి మొదలవుతున్నందున ఫ్యాక్టరీ నిర్మాణం వేగం పెంచాలని సూచించారు. పనులు పూర్తి చేసి రైతులకు లాభం చేకూర్చాలని ఆయన ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా ఉద్యానవనశాఖ అధికారి సువర్ణ, తెలంగాణ ఆయిల్‌ఫెడ్ అధికారులు తదితరులున్నారు.

ప్రభుత్వ పాఠశాలలో నో అడ్మిషన్స్



పాఠశాల గేటుకు ఏర్పాటు చేసిన నోఅడ్మిషన్స్ బోర్డు


ఎక్కువగా ప్రైవేటు స్కూళ్లలో నో అడ్మిషన్ బోర్డులు దర్శనమిస్తుంటాయి. కానీ పక్క ఫొటోలో నో అడ్మిషన్ బోర్డు కనిపిస్తుంది మాత్రం ప్రభుత్వ పాఠశాలలో..

సిద్దిపేటలోని ఇందిరానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అడ్మిషన్ల కోసం గురువారం ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ప్రవేశ పరీక్ష అనంతరం కూడా కొందరు తల్లిదండ్రులు తమకు అడ్మిషన్ ఇప్పించమని స్కూల్‌కి వచ్చి ఉపాధ్యాయులను ప్రాధేయపడుతుండడంతో ఇలా 'నో అడ్మిషన్' బోర్డు ఏర్పాటు చేశారు.

-సిద్దిపేట జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్



పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ





వనదుర్గా ప్రాజెక్టులో మునిగి ఒకరి మృతి

పాపన్నపేట, జూన్ 14 : ఏడుపాయల ఆలయ సమీపంలోని వనదుర్గా ప్రాజెక్టులో ప్రమాదవశాత్తు మునిగి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకున్నది. ఎస్‌ఐ నరేష్ తెలిపిన కథనం ప్రకారం.. హైద్రాబాద్‌కు చెందిన ఎస్లీ వినోద్(48) వంట మనిషిగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వనదుర్గమ్మ దర్శనం కోసం కుటుంబసభ్యులతో కలిసి ఏడుపాయలకు వచ్చాడు. శుక్రవారం సాయంత్రం సమయంలో వనదుర్గా ప్రాజెక్టు వద్దకు వెళ్లారు. స్నానం చేసేందుకు వినోద్ ప్రాజెక్టులోకి దిగగా, ప్రమాదవశాత్తు నీట మునిగిపోయాడు. ఎంత సేపటికీ రాకపోవడంతో కుటుంబీకులు, స్థానికుల సాయంతో నీటిలో వెతికారు. పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని గజ ఈతగాళ్లతో గాలించగా మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. వినోద్‌కు భార్య లత, కొడుకు, కూతురు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎన్‌క్వాస్‌కు ఎంపికైన పొడిచన్‌పల్లి పీహెచ్‌సీలో డీఎంహెచ్‌వో తనిఖీ

పాపన్నపేట, జూన్ 14 : నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్ ప్రోగ్రాం(ఎన్‌క్వాస్)కు పొడిచన్‌పల్లి పీహెచ్‌సీ ఎంపికైనట్లు జిల్లా వైద్య అధికారి శ్రీరాం శుక్రవారం ప్రకటించారు. ఆయన వైద్యుడు నవీన్‌తో కలసి పీహెచ్‌సీని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పథకం ద్వారా ఎంపికైన ఆసుపత్రుల అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు అవుతాయని చెప్పారు. ఆసుపత్రిలోని రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట పీహెచ్‌సీ డాక్టర్ దీక్ష, శ్రీనివాస్‌రెడ్డి, ఇందిర, పల్లవి, భద్రప్ప, భూమేష్ తదితరులు ఉన్నారు.

ఏఆర్‌టీలో ఉద్యోగాలకు 18 న రాత పరీక్ష

సంగారెడ్డి అర్బన్, జూన్ 14: సంగారెడ్డి జీజీహెచ్‌లోని ఏఆర్‌టీ సెంటర్‌లో ఖాళీగా ఉన్న మెడికల్ ఆఫీసర్, డేటా మేనేజర్, ఫార్మాసిస్ట్ పోస్టులకు 18న రాత పరీక్ష నిర్వహించనున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ డా.అనిల్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా పోస్టులకు ఇదివరకే దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు హాజరుకావాలని సూచించారు. మెడికల్ ఆఫీసర్ పోస్టుకు నేరుగా ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు. డేటా మేనేజర్, ఫార్మాసిస్ట్ పోస్టులకు మాత్రం రాత పరీక్ష నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అభ్యర్థులు ఉదయం 10 గంటల వరకు మెడికల్ కాలేజీ-జీజీహెచ్‌కు హాజరుకావాలని ఆయన సూచించారు.

పంచాయతీ విభజన సమస్యపై అభిప్రాయ సేకరణ



ఎంపీడీవోకు వినతిపత్రం సమర్పిస్తున్న గడ్డపోతారం వాసులు

జిన్నారం, జూన్ 14 : గడ్డపోతారం పంచాయతీ విభజనపై ఎంపీడీవో అరుణ, ఎంపీవో సంతోష్, గడ్డపోతారం, అల్లీనగర్, కిష్టాయ్యపల్లి గ్రామాల్లోని ప్రజలు, నాయకులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఇటీవల గడ్డపోతారం పంచాయతీ నుంచి కిష్టాయ్యపల్లిని వేరు చేయాలని కొందరు గ్రామస్థులు విన్నవించగా, కలిసే ఉంటామని మరికొందరు అధికారులకు వినతి పత్రాలు ఇచ్చారు. అదేవిధంగా పంచాయతీ పరిధిలోని అల్లీనగర్‌ను ప్రత్యేక పంచాయతీ చేయాలంటూ అధికారులకు విన్నవించారు. ఒక పంచాయతీలో మూడు అభిప్రాయలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ఎంపీడీవో మూడు గ్రామాల్లో విధిగా సమావేశాలు నిర్వహించి, స్థానిక నాయకులు, ప్రజల అభిప్రాయాలు సేకరించారు. కలెక్టర్‌కు నివేదిక అందజేసి, వారి ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో తెలిపారు.













మూతపడిన బడి ప్రారంభం

అలిరాజపేటలో తెరుచుకున్న ప్రాథమిక పాఠశాల



అలిరాజపేటలో పాఠశాల ప్రారంభ కార్యక్రమంలో ఎంఈవో తదితరులు

జగదేవ్‌పూర్, జూన్ 14 : కరోనా సమయంలో మూసివేసిన మండల పరిధిలోని అలిరాజపేట గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఎంఈవో ఉదయభాస్కర్‌రెడ్డి శుక్రవారం తిరిగి ప్రారంభించారు. ప్రభుత్వం మూసివేసిన పాఠశాలలను పునఃప్రారంభించాలని ఆదేశించడంతో మాజీ సర్పంచ్ లక్ష్మీచంద్రశేఖర్‌రెడ్డి, గ్రామస్థులు సమావేశమై చర్చించిన తర్వాత పాఠశాలలను తెరవాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ అధికారి మాధవరెడ్డి, కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు సైదులు, గ్రామ మాజీ సర్పంచ్ లక్ష్మీచంద్రశేఖర్‌రెడ్డి, గ్రామ కార్యదర్శి సీఆర్‌పీ దయానంద్, ఐఈఆర్‌పీ కరుణాకర్ పాల్గొన్నారు.

తెరుచుకున్న ఎస్సీ హాస్టల్

మద్దూరు, జూన్ 14 : మండల కేంద్రంలో గత విద్యాసంవత్సరం మూతపడిన ఎస్సీ హాస్టల్ తెరుచుకున్నది. గతంలో ఇక్కడ పని చేసిన వార్డెన్లు సక్రమంగా రాకుండా రికార్డుల్లో విద్యార్థుల సంఖ్యను ఎక్కువగా చూపుతూ.. మెను ప్రకారం భోజనం, కాస్మొటిక్ ఛార్జీలను అందించకపోవడంతో క్రమేపీ విద్యార్థులు హాస్టల్‌కు దూరమయ్యారు. విద్యార్థుల పర్యవేక్షణ, వార్డెన్ పనితీరుపై సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినా సాంకేతిక లోపంతో పనిచేయకుండా పోయాయి. దీంతో ఎస్సీ హాస్టల్ మూతపడింది. చిన్నకోడూరు హాస్టల్ వార్డెన్‌గా పనిచేస్తున్న రవిని ఇన్‌చార్జి వార్డెన్‌గా అసిస్టెంట్ సోషల్ వేల్ఫేర్ ఆఫీసర్ సత్యనారాయణ రెండు రోజుల క్రితం నియమించారు. దీంతో వసతి గృహాన్ని శుక్రవారం పునఃప్రారంభించారు.

ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయుడికి డాక్టరేట్

మునిపల్లి, జూన్ 14 : మునిపల్లిలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయుడు జి.మంగూత్ డాక్టరేట్‌ను పొందారు. మంగూత్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో అర్థశాస్త్ర విభాగంలో 'యాదాద్రి భువనగిరి జిల్లాలో వ్యవసాయంపై రైతుబంధు పథకం ప్రభావం' అనే అంశంపై అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.కృష్ణారెడ్డి పర్యవేక్షణలో పరిశోధన చేయగా విశ్వవిద్యాలయం మంగూత్‌కు డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. మంగూత్ డాక్టరేట్ పొందడటం పట్ల ఆదర్శ పాఠశాల అధ్యాపక బృందం శుక్రవారం ఆయనను ఘనంగా సత్కరించి అభినందించారు. కాగా, ఆదర్శ పాఠశాలలో పదవ తరగతిలో పదికి పది శాతం జీపీఏ సాధించిన విద్యార్థి రామ్ శ్రీజను ప్రిన్సిపాల్ భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు సన్మానించారు.



హైదరాబాద్‌లో రాజ్‌భవన్ కమ్యూనిటిహాల్‌లో శుక్రవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్

రక్తదాతకు రాష్ట్రస్థాయి అవార్డు

కల్హేర్, జూన్ 14 : సిర్గాపూర్ మండల పరిధిలోని కడ్పల్ గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు వోతె చంద్రశేఖర్ రాష్ట్రస్థాయి ఉత్తమ రక్తదాత అవార్డును అందుకున్నారు. 52 సార్లు రక్తదానం, కరోనా మహమ్మారి వ్యాప్తి సమయంలో ప్లాస్మాదానం చేసిన చంద్రశేఖర్‌కు హైదరాబాద్ రాజ్‌భవన్ కమ్యూనిటీహాల్‌లో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, జహీరాబాద్ పార్లమెంట్ సభ్యుడు సురేష్‌షెట్కార్ ఉత్తమ రక్తదాత అవార్డును అందజేశారు. చంద్రశేఖర్‌ను మంత్రి, ఎంపీ అభినందించారు.

పిల్లలను చదివించే స్థోమత లేదు..

- **మండల లీగల్ కమిటీని ఆశ్రయించిన ఒంటరి మహిళ**
- **జడ్జి చొరవతో చదివించేందుకు ముందుకు వచ్చిన నలంద స్కూల్ యజమాన్యం**

నర్సాపూర్, జూన్ 14: ఇద్దరు పిల్లలను ఆర్థిక ఇబ్బందులతో చదివించలేకపోతున్నానని, తగిన సహాయం చేయాలని ఓ ఒంటరి మహిళ మండల లీగల్ కమిటీని ఆశ్రయించగా.. జడ్జి చొరవతో ఓ ప్రైవేటు స్కూల్ యాజమాన్యం చదివించేందుకు ముందుకు వచ్చింది. వివరాల్లోకి వెళితే.. నర్సాపూర్‌లో నివసించే టి.కావ్యకు ఇద్దరు పిల్లలు.. తనకంటు ఎవరు లేకపోవడంతో కష్టపడి పిల్లలను పోషికుంటుంది. వారిని చదివించే స్థోమత లేకపోవడంతో ఆమె మండల లీగల్ కమిటీ ద్వారా నర్సాపూర్ న్యాయస్థానంను ఆశ్రయించింది. జడ్జి కె.అనిత వెంటనే స్పందించి శుక్రవారం ఈ విషయమై స్థానిక నలంద స్కూల్ యజమాని పీఎస్ రెడ్డిని పిలిపించి పిల్లల విషయమై వివరించారు. ఉచితంగా తన స్కూల్‌లో చదివించేందుకు ఒప్పుకుని వెంటనే పాఠశాలలో చేర్పించుకున్నాడు. దీంతో జడ్జి స్కూల్ యజమాని పీఎస్ రెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. ఒంటరి మహిళకు న్యాయవాది స్వరూప సహకరించారు.

ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య

- **ప్రణాళికతో విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో భోదన**
- **పిల్లలు బడికి వెళ్లేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలి**
- **బడిబాట కార్యక్రమంలో సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి**

కంది, జూన్ 14 : ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో నిపుణులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్య అందిస్తున్నామని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. విద్యార్థులకు చదువుతోనే ఉత్తమ భవిష్యత్తు ఉంటుందని అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని కంది, కాశీపూర్, చెర్లగూడెం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను కలెక్టర్ సందర్శించారు. కందిలో విద్యార్థులకు సాముహిక అక్షరాభ్యాసం చేయించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో కొనసాగుతున్న పనులపై ఆరా తీశారు. పాఠశాలల్లోని తరగతి గదులను, పరిసరాలను, మధ్యాహ్న భోజన నాణ్యతను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు నోట్‌బుక్‌లు, యూనిఫాంలను పంపిణీ చేశారు. కంది ప్రాథమిక పాఠశాలకు ఫర్నిచర్, వాల్‌పెయింటింగ్, ఆట వస్తువులు సమకూర్చిన దాత బుగ్గన్నగారి కాశీనాథ్‌ను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వల్లూరి క్రాంతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇస్తుందన్నారు. మహిళా సంఘాలతో విద్యార్థుల యూనిఫాంలను కుట్టిస్తున్నామన్నారు. పాఠశాల పనులలో అందరినీ భాగస్వామ్యం చేయాలన్నారు. చక్కటి ప్రణాళికతో విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో భోదించాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు తరచూ తల్లిదండ్రులతో సమావేశమై విద్యార్థులకు అందిస్తున్న భోదన, పిల్లలు కనబరుస్తున్న ప్రతిభను వివరించాలని సూచించారు. పిల్లలు ఎక్కువ రోజులు సెలవులు పెడితే చదువుపై శ్రద్ధ తగ్గుతుందని, ప్రతీరోజు పిల్లలు బడికి వెళ్లేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని పేర్కొన్నారు. పిల్లలకు అన్నింటి కంటే ముఖ్యమైనది చదువేనని తెలిపారు. ఆమె వెంట తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈవో వెంకటనర్సింలు, కార్యదర్శి విద్యాధర్‌గౌడ్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు యూనిఫాంలు పంపిణీ చేస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

'ధరణి' సమస్యలపై ప్రత్యేక డ్రైవ్

రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, సీసీఎల్‌ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్

మెదక్ అర్బన్/సిద్దిపేట అగ్రికల్చర్, జూన్ 14 : ప్రత్యేక కార్యాచరణ ద్వారా ధరణి సమస్యలను పరిష్కరించాలని రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం ఆయన హైదరాబాద్ నుంచి రాజన్న సిరిసిల్ల, మెదక్, సిద్దిపేట, కరీంనగర్, పెద్దపలి, జగిత్యాల కలెక్టర్లతో పెండింగ్ ధరణి సమస్యలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా నవీన్ మిట్టల్ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ కంటే ముందు గత మార్చి 1 నుంచి 15 వరకు నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో 1.38 లక్షల ధరణి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించామన్నారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తుల పరిష్కారానికి మరోసారి ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని, తహసీల్దార్, ఆర్డీవో, అదనపు కలెక్టర్, కలెక్టర్ స్థాయిల్లో పెండింగ్‌లో ఉన్న వాటిని వేగవంతంగా పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. సక్సేషన్, పెండింగ్ మ్యుటేషన్ దరఖాస్తుల రికార్డులు పరిశీలించి వెంటనే పరిష్కరించాలన్నారు. ధరణి వెబ్‌సైట్‌కు సంబంధించి జీఎల్ఎంటీఎం 33 దరఖాస్తుల్లో డిజిటల్ సంతకాల ప్రక్రియ మార్పు చేస్తున్నామన్నారు. సీఎం ఆదేశాల మేరకు ప్రతీ మంగళ, శుక్రవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే భూసంబంధిత సమస్యలను సైతం కలెక్టర్లకు బదిలీ చేశామని, వీటిని అత్యంత ప్రాధాన్యతతో సత్వర పరిష్కారం చూపాలని సూచించారు. సిద్దిపేట జిల్లాలో 13 వేల దరఖాస్తుల పెండింగ్‌లో ఉన్నాయని మండలాలవారీగా ఆర్డీవోలు, తహసీల్దార్లతో ప్రత్యేకంగా సమీక్షిస్తూ పెండింగ్ దరఖాస్తులను త్వరగా పరిశీలించి ఆన్‌లైన్ రిపోర్ట్ పంపించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. అనంతరం మెదక్ కలెక్టరేట్‌లో పాల్గొన్న అధికారులతో కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ జిల్లాలోని ధరణి పెండింగ్ దరఖాస్తులను ప్రణాళికబద్ధంగా పరిష్కరించాలని సూచించారు. కమిషనర్ సూచనల ప్రకారం వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. డేటా కరెక్షన్ దరఖాస్తులను క్షేత్రస్థాయి విచారణ చేపట్టిన తర్వాత పరిష్కరించాలన్నారు. ప్రతీ మండలంలో సబ్ రిజిస్టర్ కార్యాలయాల ఏర్పాటుకు అనువైన భవనం, భూమి కేటాయించి ప్రతిపాదనలు పంపించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మెదక్ నుంచి వీడియోకాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు, ఏవో, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు. సిద్దిపేట కలెక్టరేట్ నుంచి కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవోలు, తహసీల్దార్లు, జిల్లా ధరణి కోఆర్డినేటర్ తదితరులు పాల్గొన్నారు.



మెదక్ కలెక్టరేట్ నుంచి వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాహుల్‌రాజ్, సిద్దిపేట కలెక్టరేట్‌లో కలెక్టర్ మనుచౌదరి

చౌటకూర్‌లో నాలుగు ఇళ్లల్లో చోరీలు

- **రూ.ఐదు లక్షలు నగదు, బంగారం, వెండి నగలు అపహరణ**
- **ఇళ్లను పరిశీలించిన జోగిపేట సీఐ.. ఆధారాలు సేకరించిన క్లూస్ టీం**



చౌటకూర్‌లో చోరీ జరిగిన ఓ ఇంట్లో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

పుల్‌కల్, జూన్ 14 : మండల కేంద్రం చౌటకూర్‌లో గురువారం అర్ధరాత్రి దొగలు బీభత్సం సృష్టించారు. నాలుగు ఇళ్లల్లో చోరీలకు పాల్పడి.. రూ.ఐదు లక్షలు నగదుతో పాటు బంగారం, వెండి నగలను దోచుకెళ్లారు. పుల్కల్ ఎస్ఐ కె.శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. అంతయ్యోల్ల రాధయ్యకు పెంకుటిల్లు, రేకుల ఇళ్లు ఉన్నాయి. రాధయ్య కుమారుడు పెంకుటింట్లో నివాసం ఉండగా, రాధయ్య రేకుల ఇంట్లో ఉంటున్నారు. రాధయ్య గురువారం రాత్రి పొలానికి కాపలగా వెళ్లగా ఆయన భార్య ఒక్కరు ఉండటంతో కుమారుడి ఇంట్లో పడుకున్నారు. రేకుల ఇంటికి తాళం వేసి ఉండటాన్ని గమనించిన దుండగులు ఇంట్లోకి చొరబడి తాళం వేసిన బీరువాను ధ్వంసం చేసి రూ.లక్షా 50 వేలు నగదు, పది గ్రాముల బంగారు గుండ్లు, ఐదు గ్రాముల కమ్మలు, 24 తులాల వెండి పట్టీలు, రెండు వెండి గ్లాసులను అపహరించారు. అదే గ్రామానికి చెందిన రంగోల్ల నాగమణి ఊరికి వెళ్లగా, ఇంటి తాళం పగులగొట్టి రూ.రెండు లక్షలు నగదు, రెండు తులాల పుస్తెల తాడు, తులం కమ్మలను అపహరించారు. ఆవంచ శంకరయ్య ఇంటికి తాళం వేసి ఆరుబయట నిద్రిస్తుండగా, తాళం పగులగొట్టి రూ.లక్షా 50 వేలు నగదు, తులంన్నర గుండ్లు, తులం కమ్మలు ఎత్తుకెళ్లారు. రంగోల్ల శ్రీనివాస్ ఇంట్లో చొరబడ్డారు. ఇంట్లో ఏమి దొరకకపోవడంతో 20 వేల రూపాయల ప్రామీసరి నోట్ పత్రాన్ని దొంగిలించారు. ఒక్కరోజే నాలుగు ఇళ్లల్లో చోరీ జరగడంతో గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ విషయమై బాధితులు పుల్కల్ పోలీసులకు సమాచారం అందించగా, ఎస్ఐ కె.శ్రీకాంత్, జోగిపేట సీఐ అనిల్‌కుమార్ బాధితుల ఇళ్లను పరిశీలించారు. వెంటనే క్లూస్ టీంను రప్పించగా, వారు ఆధారాలను సేకరించారు.

అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్న కారు.. యువకుడి మృతి

- **బర్త్‌డే వేడుకలు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా గుమ్మడిదలలో ఘటన**

గుమ్మడిదల, జూన్ 14 : స్నేహితులతో కలిసి తన బర్త్‌డే వేడుకల్లో పాల్గొని తిరిగి ఇంటికి వెళ్తున్న తరుణంలో మృత్యువు వెంటాడింది. కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్న దుర్ఘటనలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన శుక్రవారం గుమ్మడిదల గ్రామంలో చోటుచేసుకున్నది. వివరాలకు వెళ్తే.. గుమ్మడిదలకు చెందిన కాసబోయిన గణేష్(21)కు గ్రామంలో బైక్ మెకానిక్ షాపు ఉంది. తనే బర్త్‌డే సందర్భంగా గురువారం అర్ధరాత్రి తన స్నేహితులతో కలిసి పార్టీ చేసుకున్నాడు. పార్టీని ముగించుకుని తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో ఇంటికి వెళుతుండగా గుమ్మడిదల మండల కేంద్రంలోని మెదక్-హైదరాబాద్ జాతీయ రహదారిపై కానుకుంట చౌరస్తాలో కారు అదుపు తప్పి డివైడరును బలంగా ఢీకొన్నది. ఈ ప్రమాదంలో గణేష్ ఛాతికి బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు పలువురు అక్కడికెళ్లి చూడగా అప్పటికే మృతిచెందడంతో కన్నీటి పర్వతమయ్యారు. ఇప్పటివరకు తమతో ఉన్న గణేష్ ప్రమాదంలో మృతి చెందడం పట్ల సేహితులు, కుటుంబసభ్యులు జీర్ణించుకోలేకపోయారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ జిల్లా నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గణేష్ తండ్రి కాసబోయిన కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపారు.



మృతిచెందిన గణేష్ (ఫైల్)



డివైడర్ ను ఢీకొన్న కారు

షార్ట్ సర్క్యూట్‌తో
ప్రథమ చికిత్సాలయం దగ్ధం



దగ్ధమైన ప్రథమ చికిత్సాలయం, చిందరవందరగా సామగ్రి

చిన్నశంకరంపేట, జూన్ 14: విద్యుదాఘాతంతో ప్రథమి చికిత్సాలయం దగ్ధమైన సంఘటన చిన్నశంకరంపేట మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు రామలింగం ఉదయం చికిత్స కేంద్రానికి వచ్చిన రోగులకు వైద్యం అందించి బయటకు వెళ్లాడు. ప్రమాదవాశాత్తు షార్ట్ సర్క్యూట్ సంభవించడంతో చికిత్సాలయం దగ్ధమైంది. స్థానికులు పొగలు రావడం గమనించి వైద్యుడికి సమాచారం అందించి, మంటలను ఆర్పి వేశారు. ఈ ప్రమాదంలో వైద్య పరికరాలు, రూ.30వేలు నగదు కాలిబూడిదయ్యాయి. భారీ నష్టం వాటిల్లిందని ఆర్ఎంపీ వైద్యుడు రామలింగం వాపోయాడు.

డంపుయార్డులు నిరుపయోగం

- ఎరువుల తయారీ ద్వారా వచ్చే ఆదాయానికి గండి
- సేకరించిన చెత్తను కాల్చి వేస్తున్న వైనం



తిప్పనగుల్ల గ్రామంలో నిరుపయోగంగా ఉన్న డంపింగ్‌యార్డ్

నిజాంపేట, జూన్ 14 : గ్రామాల్లో స్వచ్ఛత దిశగా పని చేస్తున్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరటం లేదు. వ్యర్థాలతో ఎరువులు తయారు చేసేందుకు ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డులు నిరుపయోగంగా మారాయి. పల్లె ప్రాంతాల్లో ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను కాల్చివేస్తూ పర్యావరణానికి ముప్పు వాటిల్లే విధంగా చేస్తుతున్నారే తప్ప డంపింగ్‌యార్డుల్లో నిర్మించిన షెడ్డులో ఎరువులు తయారు చేసే దిశగా అడుగులు వేయడం లేదు. ఉపాధిహామీ పథకం కింద గత ప్రభుత్వం ప్రతీ పంచాయతీకి ఒక డంపింగ్‌యార్డును నిర్మించింది. పల్లెప్రగతిలో భాగంగా గ్రామాల్లో ప్రతీ ఇంటికి వెళ్లి తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించాలని అవగాహన కల్పించారు. అలా సేకరించిన చెత్తను డంపింగ్‌యార్డులో 45 రోజుల్లో వర్మీ కంపోస్టును తయారుచేయాలి. గ్రామ నర్సరీల్లో పెంచుతున్న మొక్కలకు వాడుకుని, మిగిలిన దానిని విక్రయించగా వచ్చిన ఆదాయాన్ని గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని ఆలోచించారు. మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో డంపింగ్‌యార్డుల ఏర్పాటు చేసి సెగ్రిగేషన్ షెడ్డులను నిర్మించారు. అయితే ఒకటీ రెండు చోట్ల తప్ప మిగతా గ్రామాల్లో వర్మీ కంపోస్టు తయారీ ప్రారంభించ లేదు. ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించి డంపింగ్‌యార్డుల సమీపంలో కాల్చి వేస్తున్నారు. లక్షలు వెచ్చించి నిర్మించిన వాటిని వినియోగించడం లేదు. ఎరువుల తయారీతో వచ్చే ఆదాయానికి గండి కొడుతున్నారు.



సేకరించిన చెత్తను కాల్చి వేస్తున్న దృశ్యం

వర్మీ కంపోస్ట్ తయారీకి కార్యదర్శులకు ఆదేశాలు

మండలంలోని ప్రతీ గ్రామంలో సేకరించిన చెత్తను డంపింగ్‌యార్డుల ద్వారా వర్మీ కంపోస్ట్ ఎరువు తయారు చేసేలా పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు ఇచ్చాం. ఈ కంపోస్ట్ ఎరువుల ద్వారా గ్రామ పంచాయతీలకు ఆదాయం సమకూరుతుంది. సేకరించిన చెత్తను కాల్చి వేస్తే తగు చర్యలు తీసుకుంటాం.

- రాజిరెడ్డి, నిజాంపేట ఎంపీడీవో

డంపింగ్‌యార్డులను వినియోగంలోకి తేవాలి

ఉపాధి హామీ ద్వారా కేంద్ర ప్రభుత్వం రూ.2.50 లక్షల నిధులు మంజూరు చేస్తే పంచాయతీకో డంపింగ్‌యార్డు నిర్మాణ పనులను చేపట్టారు. మొన్నటి వరకు ఉన్న పంచాయతీ పాలకవర్గాలు నిర్లక్ష్యం కారణంగా సేకరించిన డంపింగ్‌యార్డులు నిరుపయోగంగా మారాయి. సేకరించిన చెత్తను కాల్చివేసింది. వర్మీ కంపోస్టు ఎరువు తయారీపై శ్రద్ధ చూపలేదు. దీంతో పంచాయతీలకు వచ్చే ఆదాయాన్ని గండి కొడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత అధికారులు, దృష్టి సారించి డంపింగ్‌యార్డులను వినియోగంలోకి తేవాలి

- ఆకుల రమేష్, బీజేపీ సీనియర్ నాయకులు

నట్టల నివారణ మందులు ఇవ్వరా?

- **ఏడాదిన్నరగా నిలిపివేత**
- **ప్రభుత్వం నుంచి సరఫరా కాని వైనం**

చిన్నకోడూరు, జూన్ 14 : ఏడాదికి రెండుసార్లు జీవాల (మేకలు, గొర్రెలు)కు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నట్టల నివారణ మందులు అందించేవారు. పశు వైద్యశాలల సిబ్బంది రోజుకు ఓ గ్రామానికి చొప్పున వెళ్లి ఇచ్చేవారు. సంవత్సరానికి రెండుసార్లు జనవరి, ఫిబ్రవరి మాసంలో ఒకసారి జూన్, జూలై మాసంలో మరోసారి ప్రభుత్వం నుంచి సరఫరా అయ్యేది. 2022 వరకు ఈ ప్రక్రియ కొనసాగింది. ఆ తర్వాత నుంచి నిలిచిపోయింది. కాపరులు ప్రతీరోజు పశువైద్య సిబ్బందిని అడగటం, ప్రభుత్వం నుంచి సరఫరా లేదని సిబ్బంది చెప్పడం పరిపాటిగా మారిపోయింది. మూడు పర్యాయాలు సరఫరా కావాల్సిన మందులు నేటి వరకు అందలేదు. గత జనవరి, ఫిబ్రవరిలోనైనా వస్తాయని ఎదురు చూసిన కాపరులకు నిరాశే మిగిలింది.

ఆరోగ్యంగా ఎదిగేందుకు

ప్రస్తుతం మేకలు, గొర్రెల మాంసానికి మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంది. వాటి కడుపులో నట్టలు ఉంటే అవి ఆరోగ్యంగా ఎదగలేవు. జీవాల కడుపులోని పేగుల వెంట ఉండే నాలుగు రకాల పరాన్న జీవులు వాటి రక్తాన్ని తాగుతుంటాయి. దీనితో జీవాల ఎదుగుదలను సరిగ్గా లేక మాంసం ఉత్పత్తి తగ్గిపోతుంది. నట్టల నివారణ మందులు తాగించడం ద్వారా పరాన్నజీవులు చనిపోయి ఆరోగ్యంగా బలంగా ఉంటాయి. అందుకే సంవత్సరానికి రెండు సార్లు ప్రభుత్వమే నట్టల నివారణ మందులను ఉచితంగా పంపిణీ చేస్తుంది. 2019లో పశు సంవర్ధక శాఖ అధికారులు నిర్వహించిన లెక్కల ప్రకారం చిన్నకోడూరు మండలంలో 41,061 గొర్రెలు, 9,203 మేకలు ఉన్నాయి. జీవాలకు క్రమం తప్పకుండా ఆరు నెలలకోకసారి నట్టల నివారణ మందులు ఇచ్చేవారు. ఏడాదిన్నర దాటిన జీవాలకు మందివ్వలేదని కాపరులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం నుంచి సరఫరా లేదు



ప్రభుత్వం నుంచి నట్టల నివారణ మందులు సరఫరా కాకపోవడంతో మూడు పర్యాయాలు జీవాలకు తాగించలేదు. కావాల్సిన మందుల వివరాలను ప్రభుత్వానికి నివేదించాం. అవి రాగానే జీవాలకు తాగిస్తాం.

- మంజుల, మండల పశు వైద్యాధికారిణి, చిన్నకోడూరు



సర్కారు బడుల బలోపేతానికి ప్రత్యేక చర్యలు


నంగునూరు: పాలమాకుల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న డీఈవో

ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా జిల్లావ్యాప్తంగా పలు మండలాల్లోని సర్కారు బడుల్లో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. శుక్రవారం ఆయా గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాల్లో విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులు కొత్తగా చేరిన విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్‌కు దీటుగా నాణ్యమైన విద్యతో పాటు సౌకర్యాలను కల్పిస్తున్నట్టు తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

నంగునూరు, జూన్ 14 : ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని డీఈవో ఎల్లంకి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని పాలమాకుల ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేశారు. అనంతరం డీఈవో చేతుల మీదుగా చిన్నారులకు అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ- ఉపాధ్యాయ బదిలీలు పూర్తికాగానే అన్ని సబ్జెక్టుల ఉపాధ్యాయులు వస్తారన్నారు. పాఠశాలల్లో లాంగ్వేజ్ సబ్జెక్టు టీచర్లు పూర్తిస్థాయిలో లేరని బదిలీల ద్వారా పాఠశాలల్లో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులు మొత్తం భర్తీ చేయనున్నట్టు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్యను అందుతుందని, తల్లిదండ్రులు తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలలోనే తమ పిల్లలను చేర్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఏటీ తులసి పరమేశ్వర్, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్ రావు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు పొన్నమల రాములు, పలువురు ఉపాధ్యాయులు, హస్టల్ వార్డెన్ గణేశ్, అమ్మ కమిటీ చైర్మన్ మమత, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.


చిన్నకోడూరు: రామంచ పాఠశాలలో చిన్నారుల అక్షరాభ్యాసంలో ఉపాధ్యాయులు

● **చిన్నకోడూరు:** మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు ఉపాధ్యాయులు శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో సరస్వతీ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు.

● **చేర్యాల:** మండలంలోని ఆకునూరు ఎంపీపీఎస్‌లో శుక్రవారం హెచ్‌ఎం కర్రోల్ల విజయ్ ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జడ్పీఎస్ఎస్ హెచ్‌ఎం అయిలయ్యతో విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించారు. బీఆర్ఎస్ నాయకుడు జంగిటి భిక్షపతి, ముచ్చాల శ్రీనివాస్ విద్యార్థులకు బ్యాగులు, నోటుబుక్స్, స్టేషనరీని ఉచితంగా పంపిణీ చేశారు.

● **మిరుదొడ్డి:** అక్బర్‌పేట-భూంపల్లిమండలం రుద్రారం ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మల్లేశం, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ లక్ష్మి, ఉపాధ్యాయులు వెంకటరాజం, రామచంద్రం, బాలకృష్ణ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


చేర్యాల: ఆకునూరు ఎంపీపీఎస్‌లో చిన్నారులతో అక్షరాలను దిద్దిస్తున్న హెచ్‌ఎం అయిలయ్య

● **రాయపోల్:** మండలంలోని వడ్డెపల్లి ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్ చంద్రయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లిష్ మీడియం బోధన చేస్తున్నామని, ప్రైవేటుపాఠశాలలకు వెళ్లి డబ్బు వృథా చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేణు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


రాయపోల్: వడ్డెపల్లి పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమంలో విద్యార్థులు

● **కుకునూరుపల్లి:** మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో మండల నోడల్ ఆఫీసర్ సత్తయ్య, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో కొత్తగా పాఠశాలలో చేరుతున్న పిల్లలకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పీఎన్ఆర్ ట్రస్ట్ అధినేత పోల్కంపల్లి నరేందర్, ఉపాధ్యాయులు శంకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్‌లో చేర్పించి డబ్బు వృథా చేసుకోవద్దు

● మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత

హుస్నాబాద్ టౌన్, జూన్ 14 : ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించి డబ్బును వృథా చేసుకోవద్దని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. శుక్రవారం హుస్నాబాద్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన బడిబాట కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నూతన పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్స్‌ను అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులుంటారని, అన్ని సౌకర్యాలతో పాటు నాణ్యమైన విద్య బోధన అందుతుందని వివరించారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, హెచ్‌ఎం ఎస్ వెంకటయ్య కౌన్సిలర్ దొడ్డి శ్రీనివాస్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షురాలు వేముల మంజుల, మహేందర్, సత్యనారాయణరెడ్డి ఉన్నారు.



విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న చైర్‌పర్సన్

ఆటో బోల్తా.. ఇద్దరికి తీవ్ర గాయాలు


గాయపడినవారిని తరలిస్తున్న 108 సిబ్బంది

కుకునూరుపల్లి, జూన్ 14: మండలంలోని కొనాయిపల్లి శివారులో ఆటో బోల్తాపడి ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. శుక్రవారం కుకునూరుపల్లికి చెందిన అంగన్‌వాడీ సిబ్బంది కొనాయిపల్లికి వెళ్లి ఆటోలో నలుగురు తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో కొనాయిపల్లి గ్రామ శివారులోకి చేరుకోగానే మూలమలుపు వద్ద ఆటో అదుపు తప్పి బోల్తా పడడంతో రోడ్డు కిందికి దూసుకెళ్లింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న జగదీశ్వరి, శ్రీదేవిలకు తీవ్ర గాయాలు కాగా మరో ఇద్దరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ సమాచారం అందుకున్న అంబులెన్స్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని బాధితులను సిద్దిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

విద్యుత్ షాక్‌తో రైతుకు గాయాలు


బాధితుడిని అంబులెన్స్‌లో తరలిస్తున్న సిబ్బంది

దౌల్తాబాద్, జూన్ 14: మండల కేంద్రానికి చెందిన యువ రైతు గుండెకాయ గణేష్ శుక్రవారం ఉదయం తన పొలం వద్ద వ్యవసాయ పనులు చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై తీవ్రంగా గాయాలయ్యాయి. ఈ సమాచారం అందుకున్న 108 సిబ్బంది వెంటనే ఘటనాస్థలానికి చేరుకొని బాధితుడిని

ఇసుక ట్రాక్టర్‌ల పట్టివేత

బెజ్జంకి, జూన్ 14: మండలంలోని తోటపల్లి గ్రామ శివారులోని మోయతుమ్మెద వాగు నుంచి శుక్రవారం ఇసుక అక్రమ రవాణా చేస్తున్న నాలుగు ట్రాకర్లను బెజ్జంకి పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కృష్ణారెడ్డి తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేసినా, డంపులు చేసినా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

వర్షంతో ఉక్కబోత నుంచి ఉపశమనం


చిన్నకోడూరులో కురుస్తున్న వర్షం

చిన్నకోడూరు, జూన్ 14: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం మధ్యాహ్నం ఈదురు గాలులతో కూడిన ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి ఉక్క బోతతో ఇబ్బందులు పడ్డ జనం ఒక్కసారిగా వాతావరణం చల్లబడడంతో ఉపశమనం లభించినట్టయ్యింది. రైతులు పంటల సాగుకు సన్నద్ధం అవుతున్న సమయంలో వర్షం కురియడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నేడు తిమ్మారెడ్డిపల్లి సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొండపాక, జూన్ 14: మండలంలోని తిమ్మారెడ్డిపల్లి సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. తిమ్మారెడ్డిపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని తిమ్మారెడ్డిపల్లి, లకుడారం, మాత్‌పల్లి, కోనాయిపల్లి, హనుమాన్‌నగర్ చెందిన గృహ, వ్యవసాయ పరిశ్రమల వినియోగ దారులకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని వివరించారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

హుస్నాబాద్ టౌన్, జూన్ 14: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత శుక్రవారం కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. అలాగే పట్టణంలోని మురుగు కాల్వల్లో చైర్‌పర్సన్ ఆకుల రజిత ఆయిల్ బాల్స్, బ్లీచింగ్ పౌడర్ స్ప్రే చేయించారు.

● అక్కన్నపేట, జూన్ 14: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం కల్యాణలక్ష్మి చెక్కులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంగపల్లి ఐలయ్య పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 151 మంది లబ్ధిదారులకు రూ. 15.11 కోట్ల విలువైన చెక్కులను అందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పలు గ్రామాల ఎంపీటీసీలు, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్ రూమ్ పనులను పూర్తి చేయాలి

హుస్నాబాద్ టౌన్, జూన్ 14 : హుస్నాబాద్ పట్టణంలో పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని శుక్రవారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి లబ్ధిదారులు వినతిపత్రం సమర్పించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్‌రూమ్‌లను పూర్తి చేయించాలని కోరారు. ఇళ్ళ కేటాయింపులు జరిగి పూర్తి కాకపోవడంతో గూడు లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అయిలేని మల్లిఖార్జున్‌రెడ్డి, చిరంజీవి, సతీష్, జీవన్, రాజు, లక్ష్మి, ప్రియ, సునీత, పద్మ తదితరులున్నారు.

ఎట్టకేలకు కేజీబీవీలో సమస్య కొలిక్కి

మర్కుక్, జూన్ 14: కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల మర్కుక్‌లో కొన్ని నెలలుగా డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంటూ విద్యార్థులకు సమస్యగా మారింది. మురుగు నీరు, స్నానాల నీరు ఒకేచోట చేరి పాఠశాల ఆవరణలో దుర్వాసన వెదజల్లడంతో ఉక్కిరిబిక్కిరయ్యారు. దీంతో గత మార్చి 25న 'కస్తూర్బా కంపు కంపు' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తకు ఎంపీడీవో వెంటనే స్పందించి నిధులు మంజూరు చేశారు. అయితే పాఠశాలకు సెలవుల కారణంగా పనులు నిలిచిపోగా, ప్రస్తుతం పునఃప్రారంభం కావడంతో శుక్రవారం ఎంపీటీసీ సభ్యులు ధనలక్ష్మి కృష్ణ పాఠశాల ఆవరణలో ఎక్స్‌కవేటర్‌తో ఇంకుడుగుంతను తీయించి పనులను ప్రారంభించారు. మురుగునీటికి ప్రత్యేక పైప్‌లైన్‌తో పాటు ఇతర అవసరాలకు ఉపయోగించే నీటిని ఇంకుడుగుంతలోకి వెళ్లేలా పనులు చేపట్టారు. కాగా గతంలో ఎన్నోసార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోగా, ఆంధ్రజ్యోతి కథనానికి స్పందించి పనులు ప్రారంభించడం పట్ల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.



ఎక్స్‌కవేటర్‌తో పనులు ప్రారంభించిన దృశ్యం

మున్సిపల్ సమావేశంలో పలు తీర్మానాలు


సమావేశంలో చైర్‌పర్సన్ స్వరూపారాణి, సభ్యులు

చేర్యాల, జూన్ 14: చేర్యాల మున్సిపల్ సాధారణ సర్వసభ్య సమావేశం శుక్రవారం చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి అధ్యక్షతన మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణాభివృద్ధి, మౌలికవసతుల కల్పన తదితర అంశాలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. మున్సిపాలిటీలో గత మూడేళ్లుగా నిర్వహించిన లావాదేవీల వివరాలు వెల్లడించాలని, గతంలో వార్డుల వారీగా ప్రతిపాదించిన విద్యుత్ స్తంభాలను త్వరితగతిన ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. మున్సిపల్ తొలినాళ్లలో చెల్లించిన పన్నులను సర్దుబాటు చేసి ప్రజలపై భారం తగ్గించాలని, వితంతు పింఛన్లను త్వరగా మంజూరు చేసేందుకు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. పట్టణంలో చేపట్టాల్సిన సీసీ రోడ్లు, సీసీ కల్వర్టులు, డ్రైన్ల మరమ్మతుల నిర్వహణపై చర్చించారు. పారిశుద్ధ్యం సక్రమంగా నిర్వహించడంతో పాటు మునిసిపాలిటీ ఆదాయం పెంపొందించే చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సమావేశంలో మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ నర్సయ్య, వైస్‌చైర్మన్ నిమ్మ రాజీవ్‌కుమార్‌రెడ్డి, కౌన్సిలర్లు ఆడెపు నరేందర్, చెవిటి లింగం, మంగోలు చంటి, ముస్త్యాల తార, యాట కనకవ్వ, జుబేబా కాటూన్, ఉడుముల ఇన్నమ్మ, తుమ్మల పల్లి లీల, పచ్చిమడ్ల సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

రైతు రుణమాఫీ వెంటనే అమలు చేయాలి

● మండల సర్వసభ్య సమావేశంలో తీర్మానం

నంగునూరు, జూన్ 14: ఖరీఫ్ సీజన్‌కు ముందే రాష్ట్రప్రభుత్వం రైతు భరోసా పథకంతో పాటు రుణమాఫీ అమలు చేయాలని సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఎంపీపీ జాప అరుణాదేవి అధ్యక్షతన శుక్రవారం నంగునూరు మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని పెట్టుబడి సాయంతో పాటు రైతురుణమాఫీ వెంటనే అమలు చేయాలని పేర్కొన్నారు. వివిధ శాఖలకుచెందిన అధికారులు తమ నివేదికలను చదివి వినిపించారు. కాగా సమావేశానికి చాలామంది అధికారులు గైర్హాజరయ్యారు. సమావేశానికి హాజరుకాని అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ సభ్యులు తీర్మానించారు. ప్రజా పాలనలో గ్రామ పంచాయతీల కేటాయించిన స్పెషల్ ఆఫీసర్ సైతం సర్వసభ్య సమావేశానికి డుమ్మా కొట్టారు. రెవెన్యూ అటవీ శాఖ, ఇరిగేషన్, ఆర్టీసీ,ఈజీఎస్,ఆర్ అండ్ బీ, ఉద్యానవన శాఖ, ఎక్సైజ్ శాఖ, మత్స్య, పట్టు పరిశ్రమ శాఖ అధికారులకు నోటీసులు పంపుతామని ఇన్‌చార్జి ఎంపీడీవో వేణుగోపాల్ తెలిపారు. సమావేశంలో జడ్పీటీసీ తడిసిన ఉమా, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు కర్రకంటి రేణుకా,సొసైటి చైర్మన్ ఎల్లంకి మహిపాల్‌రెడ్డి, ఎంపీటీసీలు బెదురు తిరుపతి, శనిగరం బాబు, కోల సునీత, జాజాల సుమలత జోస్నారెడ్డి, కోఆప్షన్ సభ్యుడు రహీం పాషా, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అరుణాదేవి

ఎల్లమ్మతల్లికి మొక్కులు చెల్లించుకున్న ఎంపీపీ


మొక్కులు చెల్లించుకుంటున్న ఎంపీపీ మానస

హుస్నాబాద్‌రూరల్, జూన్ 14: హుస్నాబాద్ మండల పరిషత్ అధ్యక్షురాలు లకావత్ మానస శుక్రవారం పట్టణంలోని రేణుకా ఎల్లమ్మను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సమృద్ధిగా వర్షాలు కురిసి, పాడి పంటలను సల్లంగ చూడాలని అమ్మవారిని మొక్కుకున్నట్లు ఎంపీపీ తెలిపారు. ఆమె వెంట జిల్లెలగడ్డ తాజా మాజీ సర్పంచ్ లావణ్య స్వరూప తదితరులు ఉన్నారు.

తైబజార్ వేలంలో రూ.35.16లక్షల ఆదాయం

జగదేవ్‌పూర్, జూన్ 14: జగదేవ్‌పూర్ మేజర్ గ్రామ పంచాయతీలో శుక్రవారం నిర్వహించిన వేలంపాట ద్వారా రూ.35.16 లక్షల ఆదాయం వచ్చినట్లు డీఎల్పీవో లత, గ్రామ కార్యదర్శి హరిప్రసాద్ తెలిపారు. గ్రామ పంచాయతీ ఆవరణలో నిర్వహించిన వేలంపాటలో జగదేవ్‌పూర్‌కు చెందిన కోటేటి కిషన్ పశువుల రహదారిని రూ.29లక్షలతో దక్కించుకున్నారని, అలాగే కొంపల్లి బాలకృష్ణ కూరగాయల మార్కెట్‌కు 6.16 లక్షలతో దక్కించుకున్నారని వారు తెలిపారు.

విత్తన దుకాణాల్లో తనిఖీలు

కుకునూరుపల్లి, జూన్ 14: మండల కేంద్రంలోని ఎరువులు, విత్తన దుకాణాల్లో టాస్క్‌ఫోర్స్, వ్యవసాయ అధికారులు తనిఖీలు నిర్వహించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎరువులు, విత్తన దుకాణాల్లో అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ బాబునాయక్, టాస్క్‌ఫోర్స్ సూపరింటెండెంట్ రమేష్ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్, బిల్‌బుక్స్, సీడ్‌సెల్ రిజిస్టర్ రైతు వారిగా పరిశీలించారు. తనిఖీల్లో ఉమ్మడి కొండపాక మండల ఏవో ప్రియదర్శిని పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

గజ్వేల్, జూన్ 14: గజ్వేల్ పట్టణంలోని బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లోని మోడల్ స్కూల్ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న పొలిటికల్ సైన్స్(పీజీటీ) సబ్జెక్టు గంటల ప్రతిపాదికన బోధించేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఈ.గోపీ తెలిపారు. ఈ నెల 19వతేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తామని, అదే రోజు డెమో, ఇంటర్వ్యూ నిర్వహిస్తామని తెలిపారు. పీజీ, బీఈడీ పూర్తి చేసిన అభ్యర్థులు తెలంగాణ మోడల్ స్కూల్ గజ్వేల్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

రేషన్‌కార్డుల వెరిఫికేషన్

మద్దూరు, జూన్ 14: మండలంలో నూతన రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకున్నవారి జాబితా వచ్చిందని, అర్హులైన వారి వివరాలు సేకరిస్తున్నట్లు ఆర్‌ఐ రమేష్ తెలిపారు. ఈ విషయమై ఆర్‌ఐ రమేష్ మాట్లాడారు. మద్దూరు మండలంలో 99మంది, దూళిమిట్ట మండలంలో 512 మంది రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. జాబితాలో పేర్లున్న వారు అర్హులా.. కాదా? అనే వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. కుటుంబ సభ్యులు ఆధార్‌కార్డులు, పాస్‌ఫొటో, గ్యాస్, విద్యుత్ బిల్లుల ప్రతులు తదితర వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు.

మిషన్ భగీరథ నల్లాల ఇంటింటి సర్వే

ధూళిమిట్ట, జూన్ 14: మండలంలోని జాలపల్లి, లింగాపూర్ గ్రామాల్లో జరుగుతున్న మిషన్ భగీరథ నల్లాల ఇంటింటి సర్వేను, ఉపాధిహామీ పనులను ఏంపీడీవో రాంమోహన్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మిషన్ భగీరథ నల్లాల ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. అనంతరం ఉపాధిహామీ పనులను పరిశీలించి పీల్డ్ అసిస్టెంట్లకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏంపీవో ఖాజామొయినుద్దీన్, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, రాజు గౌడ్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అల్బెండజోల్ మాత్రలను అందరికీ పంపిణీ చేయాలి

గజ్వేల్, జూన్ 14: పిల్లలకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయాలని గజ్వేల్ వైస్ ఎంపీపీ కృష్ణాగౌడ్ సూచించారు. గజ్వేల్ పట్టణంలోని ఐవోసీలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 20న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. శ్రీగిరిపల్లి పీహెచ్‌సీ పరిధిలో 27,927 మంది, అహ్మదీపూర్ పీహెచ్‌సీ పరిధిలో 12,623మంది పిల్లలు ఉన్నారని వారందరికీ మాత్రలు ఇవ్వాలని చెప్పారు. వారితో డాక్టర్ బల్బీర్ సింగ్, డాక్టర్ ప్రణయ్‌రాజ్, సీడీపీవో సరిత, సీహెచ్‌వో ఖాసీం, హెచ్‌ఈవో సత్యనారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

టీపీటీఎఫ్ విద్యాసదస్సును జయప్రదం చేయండి

గజ్వేల్/చేర్యాల/నంగునూరు, జూన్ 14: గజ్వేల్ పట్టణంలోని మహతి ఆడిటోరియంలో ఈ నెల 16న టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న విద్యా సదస్సును జయప్రదం చేయాలని టీపీటీఎఫ్ గజ్వేల్ జోన్ కన్వీనర్ సుంచు నరేందర్ పిలుపునిచ్చారు. గజ్వేల్ పట్టణంలోని టీపీటీఎఫ్ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉపాధ్యాయ దర్శిని ప్రధాన సంపాదకులు ప్రకాశ్‌రావు ఉద్యోగ విరమణ సందర్భంగా గజ్వేల్ పట్టణంలోని మహతి ఆడిటోరియంలో విద్యా సదస్సును నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సదస్సును ఉపాధ్యాయులు, మేధావులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. చేర్యాల మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన టీపీటీఎఫ్ యూనియన్ సమావేశంలో యూనియన్ మండలాధ్యక్షుడు నిమ్మ బాపురెడ్డి మాట్లాడుతూ ఈ నెల 16న గజ్వేల్‌లో నిర్వహించే విద్యసదస్సును విజయవంతం చేయాలని కోరారు. టీపీటీఎఫ్ గజ్వేల్ జోన్ ఆధ్వర్యంలో జరిగే విద్యా సదస్సు విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ కనకయ్య, రాష్ట్ర నాయకులు పొన్నమల్ల రాములు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల శాఖ అధ్యక్షులు పోనమల్ల హరికృష్ణ ఆధ్వర్యంలో నర్మెట హై స్కూల్‌లో టీపీటీఎఫ్ విద్యా సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు.


ప్లాస్టిక్ వినియోగిస్తే చర్యలు తప్పవు: డీఎల్పీవో

జగదేవ్‌పూర్, జూన్ 14: జగదేవ్‌పూర్ గ్రామపంచాయతీ పరిధిలోని చికెన్ మటన్ దుకాణదారులు ప్లాస్టిక్ వాడితే చర్యలు తప్పవని జగదేవ్‌పూర్ ప్రత్యేక అధికారి డీఎల్పీవో లత హెచ్చరించారు. శుక్రవారం జగదేవ్‌పూర్ మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో చికెన్ మటన్ యజమానులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చికెన్ మటన్ దుకాణాదారులు ప్లాస్టిక్ కవర్లు వాడొద్దని, అలాగే వేస్టేజీని రోడ్లపై డంప్ చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. దుకాణాదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తల పట్ల వారికి అవగాహన కల్పించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కవిత, ఎంపీడీఓ యాదగిరి, ఎంపీవో శ్రీనివాసవర్మ, కార్యదర్శి హరిప్రసాద్, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

'నీట్‌ను రద్దు చేసి తిరిగి నిర్వహించాలి'

సిద్దిపేట టౌన్, జూన్ 14: ఇటీవల విడుదలైన నీట్ ఫలితాల్లో అవకతవకల కారణంగా ఆ పరీక్షను వెంటనే రద్దు చేసి తిరిగి నిర్వహించాలని ఎన్ఎస్‌యూఐ విభాగం సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు అజ్మత్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాషాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం సిద్దిపేట పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వానికి పార్టీల పొత్తులపై ఉన్న శ్రద్ధ, విద్యార్థుల భవిష్యత్తుపై లేదన్నారు. జరిగిన విద్యార్థుల ఆత్మహత్యలకు ముమ్మాటికీ కేంద్ర ప్రభుత్వం, ఎన్‌టీఏ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) కారణమన్నారు. విద్యార్థులకు సరైన న్యాయం చేయకపోతే ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు సాయిప్రతాప్, నిశాంత్, రాజు, వినయ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఎమ్మార్సీ కార్యాలయం వద్ద ఏఐఎస్ఎఫ్ ధర్నా


చేర్యాల ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

చేర్యాల, జూన్ 14 : విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న చేర్యాల ఎంఈవోతో పాటు ఎమ్మార్సీ కార్యాలయ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేస్తూ ఏఐఎస్ఎఫ్ నాయకులు శుక్రవారం ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి జెరిపోతుల జనార్దన్ మాట్లాడుతూ విద్యాసంవత్సరం ప్రారంభమైనప్పటికీ కార్యాలయంలో ఎవరూ అందుబాటులో ఉండటం లేదని మండిపడ్డారు. చేర్యాలలో ప్రభుత్వ అనుమతులు లేకుండా పాఠశాలలు నిర్వహిస్తున్నా చర్యలు తీసుకోకపోవడం తగదన్నారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రామగల్ల నరేశ్, నాయకులు వేల్పుల ప్రసన్నకుమార్, చెట్ల సమ్మన్న, సిద్దుల సుమదన్, యాసిన్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో పారిశుధ్య కార్మికుడి మృతి

దౌల్తాబాద్, జూన్ 14: మండల పరిధిలోని దొమ్మాట గ్రామానికి చెందిన పంచాయతీ కార్మికుడు ముత్యాల లింగం 10 నెలల క్రితం విధుల్లో ఉండగా, గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌పై నుంచి ప్రమాదవశాత్తు జారిపడి కాలు విరిగింది. వైద్యానికి డబ్బు లేక లింగం మంచానికే పరిమితమై ఆరోగ్యం క్షీణించడంతో గురువారం మృతి చెందాడు. సీఐటీయూ జిల్లా కోశాధికారి గొడ్డుబర్ల భాస్కర్ శుక్రవారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మృతుడి కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి, ఆర్థిక సాయం అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు నరేష్,సీఐటీయూ మండల కార్యదర్శి బాల్‌రాజు, కృష్ణ, ప్రవీణ్, శ్రీకాంత్, అంజనేయులు,నాగరాజు,అంజయ్య,తదితరులు పాల్గొన్నారు.

మోకుదెబ్బ గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడిగా రవీందర్‌గౌడ్

హుస్నాబాద్, జూన్ 14 : సర్వాయి పాపన్న మోకు దెబ్బ గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడిగా హుస్నాబాద్ పట్టణానికి చెందిన చీకట్ల రవీందర్‌గౌడ్‌ను నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు జక్కి వీరస్వామి గౌడ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన హుస్నాబాద్‌లో రవీందర్‌గౌడ్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రవీందర్ గౌడ్ మాట్లాడుతూ జిల్లాలో సంఘాన్ని బలోపేతం చేసి గౌడ కల్లు గీతా కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలుద్దాం

● ప్రపంచ రక్తదాన దినోత్సవంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి పుట్ల శ్రీనివాస్

గజ్వేల్/కొండపాక, జూన్ 14: రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలుద్దామని సిద్దిపేట జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి పుట్ల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గజ్వేల్ పట్టణంలోని జిల్లా ఆసుపత్రిలో ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ- రక్తదానం చేయడం వల్ల ఒక నిండు ప్రాణాన్ని కాపాడినవారమవుతామన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు, అత్యవసర పరిస్థితుల్లో రక్తం చాలా అవసరం ఉంటుందన్నారు. రక్తదానం ద్వారా హృదయ సంబంధ ప్రమాదాన్ని నివారించవచ్చని, క్యాన్సర్ ప్రమాదాలు తగ్గుతాయని, తాజా కణాల ఉత్పత్తి సులభతరం కావడంతో పాటు మరెన్నో లాభాలున్నాయని వివరించారు. కార్యక్రమంలో సుమారు 50 మంది రక్తదానం చేసి చేశారు. అనంతరం జిల్లా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ సాయి కిరణ్ మాట్లాడుతూ ఎవరికైనా రక్త అవసరం ఉంటే జిల్లా ఆసుపత్రిలోని బ్లడ్ బ్యాంక్‌ను సంప్రదించవచ్చునన్నారు. కార్యక్రమంలో లెప్రసీ అండ్ ఎయిడ్స్ కంట్రోల్ అధికారి డాక్టర్ శ్రీదేవి, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్, నవీన్, జిల్లా మాస్ మీడియా ఆఫీసర్ డాక్టర్ ప్రణయ్ రాజ్, డాక్టర్ బల్బీర్ సింగ్. డాక్టర్ శ్రీనివాస్, కే .రవీందర్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ డానియేల్ తదితరులున్నారు. అనంతరం జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి శ్రీనివాస్ కొండపాక పీహెచ్‌సీని శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ప్రపంచ రక్త దాతల దినోత్సవం పురస్కరించుకొని కొండపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహిస్తున్న ఆరోగ్య కార్యక్రమాల పనితీరును పరిశీలించారు. రక్త దానం యొక్క ప్రాముఖ్యతను ఆరోగ్య సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీనివాస్, వైద్య అధికారులు, డాక్టర్ శ్రీధర్, ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ రజని, ఏవో రవీందర్ రెడ్డి , డానియల్, సిబ్బంది పాల్గొన్నారు.


గజ్వేల్‌లో నిర్వహించిన రక్తదాన దినోత్సవంలో డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్, ఆస్పత్రి సిబ్బంది

రక్తదాతలు ముందుకు రావాలి

సిద్దిపేట టౌన్, జూన్ 14: రక్తదాతలు ముందుకు వచ్చి ఆపదలో ఉన్న రోగుల ప్రాణాలు కాపాడాలని సిద్దిపేట ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్ అధికారి బి. స్వాతి, డా. రామ్మోహన్ తెలిపారు. శుక్రవారం సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అనుబంధ మెడికల్ కళాశాలలో ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఎన్ఎస్ఎస్ విభాగానికి చెందిన విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో డా. సదానందన్ తదితరులు పాల్గొన్నారు.

వాసవి వనితాక్లబ్ ఆధ్వర్యంలో..

సిద్దిపేట అర్బన్, జూన్ 14: రక్తదానం ప్రాణదానంతో సమానమని వాసవి క్లబ్ జిల్లా ట్రెజరర్ పుల్లూరి శ్రీనివాస్ తెలిపారు. ప్రపంచ రక్తదాన దినోత్సవ సందర్భంగా శుక్రవారం వాసవి వనితాక్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లోని రక్తనిధి కేంద్రంలో దాతలు గండే శ్రీనివాస్, యాంసాని శ్రీనివాస్ రక్తదానం చేశారు. కార్యక్రమంలో వనితా క్లబ్ అధ్యక్షురాలు మర్యాల వాణి, బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జి డాక్టర్ స్వాతి, కనుక చంద్రం, రమేష్, ఆంజనేయులు, ఇమ్రాన్, ప్రణీత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


సిద్దిపేటలో రక్తదానం చేస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు